

ఫ్లాష్ బ్యాక్



పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం

ఎం.పి.ప్రసాద్

(చలనచిత్ర 1974 నవంబర్ సంచిక నుంచి)



1973 వ సంవత్సరం ఎక్కువగా కొత్తవారికి స్వాగతం పలికింది. ఎన్.భావనారాయణ నిర్మించిన "కన్నెవయసు" చిత్రంలో విలన్ పాత్రలో పదుగురినీ ఆకర్షించిన శ్రీ ఎం.పి ప్రసాద్ ఈ కోవలోకే వస్తాడు.

నటుడికి కావలసిన అన్ని హంగులూ పుష్కలంగా వున్న ఎం.పి.ప్రసాద్ స్వస్థలం గుంటూరు జిల్లాలోని "చిర్రావూరు" కాగా పెరిగింది మాత్రం కృష్ణాజిల్లా గన్నవరం. విజయవాడ లయోలా కాలేజీలో పి.యు.సి పాసై, ఇంజనీరింగ్ చదవడానికి బనారస్ వెళ్ళిపోయాడు. అప్పటికి ప్రసాద్‌కు చలనచిత్ర జీవితం గురించిన ఊహకూడా లేదు.

బెనారస్‌లో వుంటున్నప్పుడే ఒక ఫోటోస్టూడియో అధిపతి అటువైపు వెళ్ళినప్పుడల్లా ప్రసాద్ ఫోటోలు తీసేవాడు. ఆ ఫోటోలకు చూసిన మిత్రబృందం నీ ఫోటోలు చాలా బాగున్నాయి. నీవెందుకు సినిమాల్లో ట్రై చేయగూడదంటూ సలహాలు ఇచ్చేవారు.

నటుడికి కావలసింది ఒక ముక్కు ముఖమూ శుద్ధంగా వుండటమేగాదనీ, ఇంకా చాలా కావాలని అంటూ ప్రసాద్, వారిచ్చే సలహాలను పెడచెవిని పెడుతూ వుండేవాడట.

ఇదే సమయంలో ప్రముఖ దర్శకుడు శ్రీ ఎస్.డి.లాల్ తాను ప్రారంభించబోయే చిత్రానికి నూతన నటీనటులు కావాలని పత్రికలలో ప్రకటించారు. ఆ ప్రకటన ప్రసాద్ మిత్రబృందం కంటపడింది. పడడమే తరువాయి ఒక స్నేహితుడు

ప్రసాద్ ఫోటోను ఎస్.డి.లాల్‌గారికి పంపాడు. ఆ ఫోటో ఎస్.డి.లాల్‌కు అందుతూనే సదరు ఫోటోలో వ్యక్తిని ఉత్తరం రాశాడు. కానీ లాల్‌గారి వద్ద నుండి ఉత్తరం వచ్చిన ఒక నెలకుగాని అదే స్నేహితుల ఒత్తిడిమీద ప్రసాద్ మద్రాసు వెళ్ళలేదు.

అప్పట్లో ఎస్.డి.లాల్ 'స్వర్గానికి నిచ్చెనలు' అన్న చిత్రాన్ని కొత్తవారితో ప్రారంభించారు. ఆ చిత్రంలో ఎం.పి.ప్రసాద్‌కు మంచి వేషం దొరికింది. ఆ చిత్ర నిర్మాణం ఆరురీళ్ళదాకా సాగి ఆగిపోవడంతో శ్రీ ఎంపి.ప్రసాద్ తిరిగి బెనారస్‌కు ప్రయాణం కట్టి ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్నాడు.

1973 సెప్టెంబరులో ఛాయాగ్రహకులు శ్రీ కె.ఎన్.భాస్కరరావుగారి ప్రోత్సాహంతో తిరిగి మద్రాసుకు వచ్చాడు. వచ్చిన కొద్దిరోజులకే శ్రీమతి వాసంతి నిర్మిస్తున్న 'మేమూ మనుషులమే' చిత్రంలో ఎం.పి ప్రసాద్‌కు వేషం దొరికింది. ఈ చిత్రంలో నటిస్తూవుండగానే శ్రీ ఎన్.భావనారాయణగారు పిలిపించి తన కన్నెవయసు చిత్రంలో వేషం యివ్వడమేగాక తాను నిర్మించే మరో మూడు చిత్రాలలో వేషాలు వేయడానికి అగ్రిమెంటు రాయించుకున్నారు.

ఈ రెండు చిత్రాల అనుభవంతో తాను నటించగలననే ధైర్యం, తానూ వెండితెరకు పనికివస్తానన్న ధీమా ప్రసాదుకు వచ్చాయి.

ఆ తరువాత అతడు నవభారత్ ప్రొడక్షన్స్‌వారి 'ముగ్గురమ్మాయిలు', లోకేశ్వరీవారి 'ఆడంబరాలు – అనుబంధాలు', ఎన్.ఏ.టి స్టూడియోస్ వారి 'తాతమ్మ కల' చిత్రాలలో నటించారు.

ప్రస్తుతం మరో నాలుగు చిత్రాలలో నటిస్తూన్న ప్రసాద్ స్వభావరీత్యా సాత్వికుడు. మంచితనం ఎప్పుడైనా ఉపకరిస్తుందన్న నమ్మకమున్నవాడు. ఈ వర్ధమాన యువనటుడు దినదిన ప్రవర్ధమానమై వెలుగులోకి రాగలడని చలనచిత్ర పరిశ్రమ కాంక్షిస్తోంది.

Post your comments